నందిగామ ఓటర్లు ఎటువైపు?

- పట్టణంలో తగ్గిన పోలింగ్ శాతం
- ఓటింగ్‌కు దూరంగా 20శాతం మంది
- టీడీపీలో గుబులు రేపుతున్న తగ్గిన ఓటింగ్‌శాతం
- ఓటేసేందుకు బారులు తీరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వృద్ధులు, మహిళలు
- తమకే లాభించనుందంటున్న వైఎస్సార్ సీపీ నేతలు



నందిగామ డాన్‌బోస్కో స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

నందిగామ టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో నందిగామ నియోజకవర్గంలో అన్ని మండలాలతో పోల్చితే నందిగామ పట్టణంలో పోలింగ్‌శాతం భారీగా తగ్గింది. ఆయా మండలాలతో పోల్చితే నందిగామ పట్టణంలో 9నుంచి 12శాతం పోలింగ్ తక్కువగా నమోదుకావడం గమనార్హం. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05,480 మంది ఓటర్లు ఉండగా 1,79,915 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 87.56శాతం పోలింగ్ నమోదైంది. ఓటుహక్కు వినియోగించుకున్నవారిలో పురుషులు 87,768 మంది ఉండగా, మహిళలు 92,143మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. నియోజకర్గంలో నందిగామ రూరల్ మండలంలో అత్యధికంగా 91.19శాతం పోలింగ్ నమోదుకాగా, అత్యల్పంగా నందిగామ పట్టణంలో 79.72శాతం పోలింగ్ నమోదైంది. వీరులపాడు మండలంలో 89.69శాతం, చందర్లపాడు మండలంలో 89.08శాతం, కంచికచర్ల మండలంలో 88.27శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని నందిగామ రూరల్ మండలం, చందర్లపాడు, వీరులపాడు, కంచికచర్ల మండలాల కంటే నందిగామ పట్టణంలోనే అతితక్కువ పోలింగ్‌శాతం నమోదు కాగా, తగ్గిన ఈ పోలింగ్‌శాతం ఏపార్టీకి మేలు చేయనుంది..ఏపార్టీకి నష్టం కలిగించనుందనే అంశంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

అత్యధిక కేంద్రాల్లో 80శాతంలోపే పోలింగ్..

నందిగామ పట్టణంలో మొత్తం 32 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 36,492 మంది ఉండగా, వీరిలో 29,092 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కును వినియోగించుకున్నవారిలో పురుషులు 14,118మంది ఉండగా, మహిళలు 14,973మంది, థర్డ్‌జెండర్ ఓటరు ఒకరు ఉన్నారు. పట్టణంలోని 32 పోలింగ్ కేంద్రాలకుగాను 16కేంద్రాల్లో 70 నుంచి 80శాతం పోలింగ్ నమోదుకాగా, మరో 14 కేంద్రాల్లో 80నుంచి 90శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలోని హనుమంతపాలెం ఎంపీఈ స్కూల్‌లోని 103వ నంబరు పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 93.31శాతం పోలింగ్ నమోదు కాగా, పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని నూతనభవనంలో ఏర్పాటు చేసిన 92వ నంబరు పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 67.66శాతం పోలింగ్‌శాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

పోలింగ్ శాతం తగ్గడంపై టీడీపీ ఢీలా..

నందిగామ పట్టణంలో 90శాతానికిపైగా పోలింగ్ ఒకేఒక్క 103వ పోలింగ్ కేంద్రంలో మాత్రమే నమోదైంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ శాతం బాగా పెరుగగా, అగ్రవర్ణాల ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం బాగా తగ్గడం గమనార్హం. ఇందుకు పట్టణంలోని అత్యల్ప పోలింగ్‌శాతం 67.66శాతం నమోదైన 92వ పోలింగ్ కేంద్రమే నిదర్శనం. ఇక్కడ కమ్మ సామాజికవర్గ ఓటర్లు అధికంగా ఉన్నారు. 80శాతానికిపైగా పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు, మహిళలు భారీగా తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొనడంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌శాతం పెరిగింది. అత్యధిక పోలింగ్ శాతం 93.31శాతం నమోదైన 103వ పోలింగ్ కేంద్రం పరిధిలోనూ కమ్మ సామాజికవర్గ ఓటర్లు ఉన్నప్పటికీ, ఎస్సీ, బీసీ ఓటర్ల సంఖ్యే అధికంగా ఉండటం ఇక్కడ ఓటింగ్ శాతం పెరగడానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అగ్రవర్ణ ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌శాతం బాగా తక్కువ నమోదు కావడం గమనార్హం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ఓటర్లతో పోల్చితే పట్టణ ఓటర్లు ఓటేసేందుకు కొంతమేర నిరాసక్తత చూపించారనే చెప్పవచ్చు. అందుల్లో అగ్రవర్ణ ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌శాతం తగ్గడం స్పష్టంగా కనిపిస్తోంది. ఓటు నమోదు సమయంలో చూపిన ఉత్సాహం, ఓటేసే సమయంలో వారు చూపించలేదనే విషయాన్ని పోలింగ్ గణాంకాలు చెబుతున్నాయి. నందిగామ పట్టణంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 855మంది అధికంగా ఓటేశారు. నందిగామ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలతోపాటు అగ్రవర్ణ పేదలు ఓటేసేందుకు అధిక ఆసక్తి చూపించడం తమకే లాభదాయకమని అధికార వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తుండగా, టీడీపీ నాయకులు మాత్రం తగ్గిన పోలింగ్‌శాతం చూసి ఢీలాపడ్డారు. ఐదేళ్లలో ఆయా వర్గాల అభ్యున్నతికి చేసిన తమ ప్రభుత్వం చేసిన కృషి కారణంగానే వారు ఓట్ల రూపంలో కృతజ్ఞతను ప్రదర్శించారని వైఎస్సార్ సీపీ నాయకులు చెబుతున్నారు. గత 2019 ఎన్నికల్లోనూ నందిగామ పట్టణంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకు 3430 ఓట్ల మెజార్టీ లభించినందున ఈసారి కూడా ఆయన విజయానికి నందిగామ పట్టణ ఓటర్లు బాటలు వేసినట్లేనని ఆపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

నందిగామ పట్టణంలో నమోదైన పోలింగ్ శాతం వివరాలు

పోలింగ్ కేంద్రం నంబరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
78	1445	1040	71.97
79	1494	1188	79.52
80	1470	1189	80.88
81	770	599	77.79
82	1436	1103	76.81
83	1220	952	78.03
84	1394	1021	73.24
85	1477	1179	79.82
86	1486	1189	80.01
87	1359	957	70.42
88	931	769	82.60
89	898	689	76.73
90	782	635	81.20
91	898	716	79.73
92	1376	931	67.66
93	652	474	72.70
94	1173	931	79.37
95	1083	818	75.53
96	946	794	83.93
97	1140	899	78.86
98	1117	957	85.68
99	968	802	82.85
100	1009	828	82.06
101	1127	1002	88.91
102	717	614	85.63
103	717	669	93.31
104	1302	1140	87.56
105	1379	1223	88.69
106	1070	957	89.44
107	1228	919	74.84
108	1104	840	78.68
109	1288	1068	82.92

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గయ్యపేట అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో ఐదుగంటలపాటు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ ఎస్. కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలోని మిట్టగూడెం, అద్దాల బజారు, కాయితాల బజారు, పెద్ద రామాలయం, ముక్త్యాల రోడ్, నాగమయ్య బజారు, రంగస్వామి బజారు, విలియంపేట తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ వేద పండితులచే ఈహోమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

29న ఆలయ హుండీ లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈనెల 29న జరుగుతుందని ఆలయ ఇన్‌చార్జి ఈవో జయప్రకాష్ బాబు సోమవారం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కింపు జరుగుతుందన్నారు.ఆసక్తి గల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పేట ఇన్‌చార్జి ఎంఈవోగా పుష్పలత

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండల విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారిణిగా ఇబ్రహీంపట్నం ఎంఈవో-1గా పనిచేస్తున్న పుష్పలత నియమితులయ్యారు. ఈ మేరకు పుష్పలతకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు నందిగామ డివైఈవో వెంకటప్పయ్య సోమవారం తెలిపారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేస్తున్న ఎల్.చిట్టిబాబును ఉన్నతాధికారులు ఇటీవల సస్పెండ్ చేయడంతో ఆస్థానంలో పుష్పలతను నియమించారు.

సమతుల ఆహారంపై అవగాహన

నందిగామ: మండలంలోని పల్లగిరిలో సోమవారం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సమతుల ఆహారంపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పల్లగిరిలో కొద్దిరోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాల ముగింపు సందర్భంగా గ్రామస్తులకు సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండటానికి పాటించాల్సిన ఆహారపద్ధతులను వివరించారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, శేషారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



చెన్నారావుపాలెం(వీరులపాడు): వడదెబ్బకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నారావుపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొలకలూరి జయరాజు (72)సోమవారం ఉదయం రోజూ మాదిరిగానే వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో అలసటగా ఉండటంతో ఇంటికి వచ్చాడు. అనంతరం మధ్యాహ్న సమయంలో జయరాజు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఉపనదుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని కీసర మున్నేటి నుంచి కంచికచర్లకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

వీరులపాడు: పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామ శివారులో సోమవారం పేకాడుతున్నారనే సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. రెండు వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



వీరులపాడు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి సమయాల్లో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎటువంటి భంగం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని నాయకులకు సూచించారు. ముఖ్యంగా శాంతి భద్రతలకు, ప్రజా జీవనానికి విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఎస్ఐ కోరారు. సమావేశంలో అన్ని రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంఈసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న 12 సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 29వ తేదీన కుంటముక్కల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరిలో 7సీట్లు, ఎస్టీ-2, బీసీ సీ-3 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఆయా సీట్ల భర్తీ కోసం కుంటముక్కల గురుకుల పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు డీసీవో పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ప్రవేశపరీక్ష రాసినవారు ర్యాంకుకార్డు, ఆధార్, ఆయా సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విజ్ఞానం.. వినోదం..ఆరోగ్యం



కంచికచర్ల గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు



యోగా నేర్చుకుంటున్న చిన్నారులు



ఆసక్తిగా చెస్ ఆడుతున్న విద్యార్థులు

కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, ఆరోగ్యాన్ని అందిస్తోంది. శిబిరంలో భాగంగా రోజూ విద్యార్థులచే పుస్తక పఠనం చేయించడంతోపాటు యోగా, చిత్రలేఖనం, చెస్‌పై శిక్షణనిస్తున్నారు. డ్యాన్స్ కూడా నేర్పిస్తున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితేసేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు సోమవారం తెలిపారు. ఈ వేసవి శిబిరంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, కవి, రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, డాన్స్ మాస్టర్ వేల్పుల ప్రకాష్ పాల్గొంటూ విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణనిస్తున్నారు. ఈ శిబిరంలో చిన్నారులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడుపుతున్నారు. – కంచికచర్ల

24 వాహనాలు స్వాధీనం



కార్డన్ సెర్చ్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ చంద్రశేఖర్



వాహనాల ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తున్న వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడు

- ఇందిరాకాలనీలో కార్డన్ సెర్చ్
- 320 ఇళ్లు విస్తృత తనిఖీ
- పాతనేరస్తుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

కంచికచర్ల : నేర నియంత్రణ, శాంతిభద్రత పరిరక్షణ కోసం విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఇందిరాకాలనీలో 100మంది పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని 320 ఇళ్లను విస్తృతంగా తనిఖీ చేయడంతోపాటు కాలనీవాసుల వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 24వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాతనేరస్తుడు మేచర్ల అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలు తలెత్తకుండా రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని కోరారు.సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఇప్పటికే పోలీసు కవాతు నిర్వహించామన్నారు. కార్డన్ సెర్చ్‌లు కూడా చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో కంచికచర్ల ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ-2 హేమలత, వీరులపాడు, నందిగామ ఎస్ఐలు మహాలక్ష్మణుడు, హనీష్, ఏఎస్ఐ రామారావు, దుర్గారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకూ వడదెబ్బ

ముందస్తు చర్యలతో రక్షించుకోవచ్చంటున్న పశువైద్యాధికారి అనిల్



ఎండలో మేత మేస్తున్న పశువులు

పెనుగంచిప్రోలు: వేసవి ఎండలు మనుషులకు మాత్రమే కాకుండా పశువుల్లో కూడా వడదెబ్బకు దారితీస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతను రైతులు నిర్లక్ష్యం చేస్తే పశువుల్లో కూడా మరణాలు సంభవిస్తాయని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు బాగా పెరిగి తేమ శాతం తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. పశువులు కట్టివేసే చోట గాలి సక్రమంగా రాక పోవడం, , కిక్కిరిసి కట్టేయటం, నీటి సౌకర్యం సరిగా లేకపోయినా కూడా పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని పెనుగంచిప్రోలు పశువైద్యాధికారి పి.అనిల్ హెచ్చరిస్తున్నారు. వేసవిలో బయట ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు పశువుల్లో హైపోథాలమస్ స్వేద గ్రంధులపై మెదడు నియంత్రణ కోల్పోతుంది. దీంతో స్వేద గ్రంధుల ద్వారా చెమట అధికంగా పోతుంది. శరీరంలోని ఎలక్ట్రోలైట్‌లు కోల్పోయి పశువులు పూర్తిగా నీరసించి పోతాయని ఆయన చెబుతున్నారు. రైతులు తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా పశువులు వడదెబ్బ బారినపడకుండా కాపాడుకోవచ్చని పశువైద్యాధికారి అనిల్ సూచిస్తున్నారు.

వడదెబ్బ సోకిన పశువుల లక్షణాలు.....

- వడదెబ్బ సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారెన్ హీట్ కన్నా ఎక్కువగా ఉంటుంది. చర్మం గట్టి పడుతుంది.
- పశువులు నడవలేక నీడ ప్రదేశాలను వెతుక్కుంటాయి.
- చూడు పశువుల్లో గర్భస్రావాలు జరుగుతాయి. పునరుత్పత్తి ప్రక్రియ తగ్గి పాలఉత్పత్తి తగ్గిపోతుంది.
- తరచూ అపస్మారక స్థితిలోకి వెళ్తాయి.

చికిత్సా విధానం...

- వడదెబ్బ సోకిన పశువులను నీడ, చల్లని గాలి వచ్చే ప్రాంతానికి తీసుకొచ్చి శరీర ఉష్ణం సాధారణ స్థాయి వచ్చేంత వరకు నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి.
- వైద్యులను వెంటనే సంప్రదించి ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజెక్షన్లు చేయించడంతో పాటు సెలైన్‌ద్వారా గ్లూకోజ్, శక్తి నిచ్చే మందులు అందజేయాలి.

వడదెబ్బ సోకకుండా ముందస్తు చర్యలు.....

- పశువులకు నీరు అందుబాటులో ఉంచడంతో బాటు చల్లని నీళ్లతో కడగాలి. పాడి గేదెలకు పాలు పితికేటప్పుడు చల్లని నీళ్లతో పొదుగును కడగాలి.
- ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు వేసవిలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే గడ్డికి బయటకు వదలాలి.
- పశువులు నీటి కుంటల్లో, చెరువులు, వాగులు ఉంటే ఈదనివ్వాలి. గాలి, వెలుతురు బాగా ఉన్నచోట మాత్రమే కట్టేయ్యాలి.

ఎస్ఆర్ఆర్‌లో ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. 4,001 ర్యాంకు నుంచి 8వేల ర్యాంకు వరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 48 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పూజలు



శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మైనార్టీ నాయకులు



ప్రార్థనలు చేస్తున్న తుమ్మల ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా మళ్లీ గెలుపొందాలని ఆకాంక్షిస్తూ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పూజలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వారి కుటుంబసభ్యులు నాగార్జునసాగర్‌లోని మేరీమాత(సాగరమాత) దేవాలయాన్ని సందర్శించి ప్రార్థనలు చేశారు. జగ్గయ్యపేట షాదీఖానా ప్రెసిడెంట్ ఎక్బాల్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ బాలసైదా, షేక్ సత్తార్ మహారాష్ట్రంలోని హజరత్ సయ్యద్ తాజుద్దీన్ బాబాదర్గాను సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. 31వ పోలింగ్‌బూత్ నాయకులు మునిని శివ, దుడకా శ్రీధర్, బొడ్డు భాస్కర్, టి.లక్ష్మీనారాయణ, సాయి తదితరులు భద్రాచలం వద్ద ఉన్న శ్రీపెద్దమ్మ తల్లిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, విప్ సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని) మరోసారి గెలుపొందాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.

మహిళా వికాసం కోసం శిక్షణ



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): మహిళలు సాధికారతను సాధించేందుకు కృషి చేయాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ శిక్షణ కార్యక్రమం ముగింపు సభను ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసు మాట్లాడుతూ మహిళా వికాసం కోసం కళాశాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ఏడాది పొడవునా పలు కార్యక్రమాలు తమ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ నిర్వహిస్తోందని వివరించారు. స్కూటీ, కరాటే వంటి శిక్షణ ఏడాది పొడవునా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా వాసవి విజయవాడ సంస్థ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్‌కు స్కూటీని బహూకరించింది. ఈ కార్యక్రమంలో వాసవి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా అమర్‌సుధీర్, మాజేటి రామచంద్రరావు, క్లబ్ ప్రముఖులు జల్లూరి శ్రీనివాసరావు, చిట్టా విజయశ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.